
సాక్షి
పల్నాడు
సోమవారం । 9 । జనవరి । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 577.90 అడుగుల వద్ద ఉంది. ఇది 276.9578 టీఎంసీలకు సమానం.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.1813 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

పాతకోటయ్య దర్శనమెట్లంటే

- నిర్మాణానికి సిద్ధమైన కోటప్పకొండ దేవస్థానం
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- రెండువేల మెట్ల నిర్మించాలని అంచనా
- ఆలయ నిధులకు తోడు విరాళాలతో ముందుకు..
- 'మెట్టుకో దాత' పేరిట భక్తుల నుంచి రూ.20 వేల చొప్పున సేకరణ
- నిర్మాణానికి సానుకూలతలను పరిశీలించిన ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



నడకదారిలో పాతకోటయ్య స్వామి ఆలయానికి వెళ్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తదితరులు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్ : కోటివేల్పుల అండ కోటప్పకొండపై అభివృద్ధి పనులకు త్రికోటేశ్వరస్వామి దేవస్థానం అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా ప్రధాన ఆలయం నుంచి పాత కోటేశ్వరస్వామి చెంతకు మెట్ల మార్గం నిర్మాణానికి సిద్ధమైంది. దేవస్థానం నిధులు, భక్తుల విరాళాలతో ఈమెట్ల మార్గం నిర్మించనున్నారు.

రాళ్లురప్పల్లో నుంచే పాత ఆలయానికి..

ఇప్పటివరకు ప్రధాన ఆలయం వరకే మెట్లమార్గం ఉంది. దక్షిణామూర్తి రూపంలో కొలువై ఉన్న త్రికోటేశ్వరస్వామి పాత ఆలయానికి వెళ్లడానికి ఎటువంటి మార్గం లేదు. శివరాత్రి తిరునాళ్ల సమయంలో రాళ్లు, ముళ్లపొదల వెంబడి భక్తులు కొండను ఎక్కి పాతగుడిని చేరేవారు. మెట్ల మార్గం నిర్మించాలనే నిర్ణయంతో భక్తుల చిరకాల కోరిక తీరనుంది. మెట్ల మార్గం నిర్మాణ సన్నాహాలను పరిశీలించేందుకు ఆదివారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి, డీఆర్వో వినాయకం, డీఎఫ్ఓ రామ చంద్రరావు, త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈఓ గోపి పరిశీలించారు. మట్టి మార్గంలో నడుస్తూ రాళ్లురప్పలు దాటుకుంటూ కొండపైకి చేరుకొని పాత కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మెట్లమార్గం నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలు, భక్తుల విరాళాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.



కొండపై పాతకోటయ్య స్వామి ఆలయం

'మెట్టుకో దాత' పేరిట విరాళాలు..

కోటప్పకొండ శిఖరాన నెలవైన పాత కోటేశ్వరుడి ఆలయానికి వెళ్లడానికి మెట్ల మార్గాన్ని దేవస్థానం తన నిధులతో నిర్మించడానికి సిద్ధంగా ఉంది. అయితే ఈ గొప్ప కార్యక్రమంలో భక్తులనూ భాగస్వాములను చేయాలనే తలంపుతో విరాళాలనూ సేకరిస్తోంది. 'మెట్టుకో దాత' పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపడుతోంది. ప్రతి మెట్టుకు దాతల నుంచి రూ.20 వేలు స్వీకరించనున్నారు. ఆ మెట్టుపై నగదు అందజేసిన దాత పేరును రాయిపై కనిపించేలా చెక్కనున్నారు. ఎంపీ లావు రూ.10 లక్షలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి రూ.5 లక్షలు విరాళం ప్రకటించారని ఆలయ ఈఓ తెలిపారు. ఆదివారం ఒక్క రోజే భక్తులు దాదాపు రూ.కోటి విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా...

ప్రధాన ఆలయం నుంచి పాత కోటేశ్వరస్వామి గుడి వరకు దాదాపు 2,000 మెట్లు పడతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పది అడుగుల వెడల్పుతో నిర్మించే మెట్ల మార్గంలో ఐదు అడుగులు కొండపైకి వెళ్లడానికి, ఐదు అడుగులు కొండ దిగటానికి వేరు చేసేలా రెయిలింగ్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి 50 మెట్లకు ఓ చోట భక్తులు, పర్యాటకులు సేదతీరడానికి బల్లలు ఏర్పాటు చేయనున్నారు. అక్కడక్కడ నీడ కోసం రేకులతో షెడ్ నిర్మాణం, తాగునీరు అందుబాటులో ఉంచనున్నారు. మెట్ల మార్గం పూర్తయిన తర్వాత పాత ఆలయం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నామని త్రికోటేశ్వరస్వామి ఆలయం ఈఓ తెలిపారు.

దాతలు ముందుకు రావాలి

పాత కోటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల మార్గం నిర్మాణానికి ప్రసాద్ పథకంతోపాటు టీటీడీ శ్రీవాణి ట్రస్టుల నుంచి నిధుల మంజూరుకు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటంతో దేవస్థానం తన సొంత నిధులతో పనులు చేయడానికి సిద్ధమైంది. కొంతమంది భక్తులూ విరాళాలు అందించడానికి ముందుకు వస్తుండటం సంతోషకరం. దాతలు ముందుకు వచ్చి కోటప్పకొండను మరింత అభివృద్ధి చేసుకోవాలి.

– లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట లోక్‌సభ సభ్యులు.

భక్తుల కోరిక తీరనుంది

దక్షిణామూర్తిగా దర్శనమిచ్చే పాత కోటేశ్వరస్వామిని మెట్ల మార్గం ద్వారా వెళ్లి దర్శించుకోవాలన్నది భక్తుల కోరిక. ఆ చిరకాల కోరికను నెరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. దాతలు, దేవస్థానం నిధులతో మెట్ల మార్గం పనులు ఏడాదిలోగా పూర్తి చేసేలా కృషి చేస్తాం. కోటప్పకొండను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం.

– డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే.

నేడు వెనిగండ్లకు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

- కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపకార వేతనాల పంపిణీ
- ఐఏఎస్ అకాడమీ భవనం ప్రారంభోత్సవం



గవర్నర్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ట్రస్టు చైర్మన్ ఈవీ నారాయణ

పెదకాకాని: రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ రాకకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెదకాకాని మండలం వెనిగండ్లలోని కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు స్కాలర్‌షిప్పుల పంపిణీ, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనం ప్రారంభోత్సవానికి సోమవారం ముఖ్యఅతిథిగా గవర్నర్ హాజరు కానున్నారు. ఆయన రాక సందర్భంగా గ్రామ శివారు కౌండిన్యపురాన్ని గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సందర్శించారు. ఏర్పాట్లపై ట్రస్టు చైర్మన్ ఈవీ నారాయణ, కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని ట్రస్టు చైర్మన్ తెలిపారు. గవర్నర్‌తో పాటు విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా, పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు, వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ వై.సత్యనారాయణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి నుంచి పీహెచ్‌డీ వరకూ చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు వివరించారు.

న్యూస్‌రీల్

12న విద్యుత్ వినియోగదారుల సమావేశం

నరసరావుపేట: రొంపిచర్ల మార్కెట్ యార్డులో 12వ తేదీ గురువారం జరిగే విద్యుత్ వినియోగదారుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సెంటర్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మాజనార్దనరెడ్డి హాజరవుతున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు ఆదివారం వెల్లడించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

చెన్నకేశవ ఆలయంలో ధనుర్మాస పూజలు



కారెంపూడి: కారెంపూడిలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు జరిగాయి. దీనిలోభాగంగా భాగంగా గోదాదేవి అమ్మవారికి, శ్రీకృష్ణపరమాత్ముడికి మహిళలు ఆదివారం ముత్యాల హారతులిచ్చారు. ఉదయం నుంచి మహిళా భక్తులు విష్ణుసహస్రనామం, తిరుప్పావై వేదపారాయణం పఠించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి, శ్రీకృష్ణునికి ఆలయ పూజారి కొమండూరి సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులకు హారతులిచ్చారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతి కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున స్వామికి పంచామృత స్నపన నిర్వహించి విశేష అలంకారం చేశారు. ఆలయ అర్చకస్వామి పరాశరం రామకృష్ణమాచార్యులు యాజ్ఞిక పర్యవేక్షణలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన, నవగ్రహ మండపారాధన అనంతరం గోదాదేవి, పాండురంగ స్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. తొలుత ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సుమారు 50 మంది మహిళలు ఊరేగింపుగా వచ్చి గోదాదేవికి, సీతాదేవికి ధనుర్మాస సారె సమర్పించారు.

చంద్రబాబు, పవన్‌ది అనైతిక కలయిక

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల రూరల్: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ది అనైతిక కలయికని, వారు కలిసినా జగనన్న ప్రభుత్వానికి ఎటువంటి ఢోకా లేదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత చెప్పారు. ఆదివారం రాత్రి ఆమె కొత్తపేటలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ అవకాశవాద రాజకీయాలకు తెరలేపుతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎప్పుడో ప్రజల మనస్సుల్లో నుంచి తొలగిపోయారని, పవన్ కల్యాణ్ అయితే ప్యాకేజి స్టార్‌గా చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడికి ఇంకా పదవీ, అధికార కాంక్ష తగ్గలేదని, ఇంకా ప్రజలను దోచుకోవడానికే చూస్తున్నారని విమర్శించారు. అధికారం కోసం ప్రజలను ఓ బిక్షగాడి మాదిరిగా అడుక్కుంటున్నారన్నారు. ఆయనకున్న ప్రచార పిచ్చితో అమాయక ప్రజలను పొట్టనపెట్టుకుంటున్నారని, కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురి ప్రాణాలు బలిగొన్నారని ధ్వజమెత్తారు. ఆ రెండు ఘటనల్లో పవన్ కళ్యాణ్ బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని, వారి ప్రాణాలంటే లెక్కలేదా అని ప్రశ్నించారు. ఇప్పటంలో ఎటువంటి నష్టం జరగకపోయినా కావాలనే హైకోర్టులో కేసులు వేయించి కోర్టు ద్వారా మొట్టికాయలు వేయించుకున్న చరిత్ర పవన్ కళ్యాణ్‌దని ఎద్దేవా చేశారు.

దుర్గమ్మ నివేదనకు 365 దేశవాళీ రకాల బియ్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ మహా నివేదనకు 365 రకాల దేశవాళీ బియ్యాన్ని అందించనున్నామని ఎన్ఆర్ఐ కోమటిరెడ్డి మౌనిక తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం ఎన్ఆర్ఐ కోమటిరెడ్డి మౌనిక, రైతు యర్రు బాపారావుతో పాటు పలువురు భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి దేశవాళీ బియ్యం గురించి వివరించారు.

సంగీత నాదం.. సుస్వర వేదం

జనవరి అనగానే తెలుగింట పెద్ద పండుగ సంక్రాంతి అందరికీ గుర్తుకువస్తుంది. అయితే సంగీత ప్రియులకు, అలాగే సాహిత్య ప్రియులకు మాత్రం మరో రెండు పండుగలు జ్ఞప్తికి వస్తాయి. ముఖ్యంగా విజయవాడ వాసులకు ఇక్కడ నిర్వహించే బుక్ ఫెస్టివల్, సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన, సంగీతోత్సవాలు వారికి మధురానుభూతిని మిగుల్చుతాయి. దక్షిణ భారతదేశంలో చెన్నై తర్వాత సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా జరిగేది విజయవాడ నగరంలోనే. సోమవారం నుంచి సంగీత సన్మండలి సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.



సంగీత విద్వాంసులు నిర్వహిస్తున్న పంచరత్న కృతుల గోష్ఠిగానం

- నేటి నుంచి సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన, సంగీతోత్సవాలు
- వారం పాటు నిర్వహణ
- దేశ, విదేశాల నుంచి విద్వాంసుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



విజయవాడ కల్చరల్: నాదోపాసకుడు నిరంతర రామనామ జపంతో తరించి అనేక కీర్తనలను రచించిన త్యాగరాజ స్వామి తెలుగువారు. సంగీత విద్య అభ్యాసం కోసం తమిళనాడులోని తిరువయ్యార్‌లో స్థిరపడ్డారు. కోట్లాది సంగీత ప్రియులను సంగీతం వైపు నడిపించిన త్యాగరాజ స్వామి జన్మదినం అయిన జనవరి 6న ప్రపంచంలోని సంగీత ప్రియులందరూ భక్తిగా జరుపుకుంటారు. తిరువయ్యార్‌లో జరిగే త్యాగరాజ స్వామి సంగీతోత్సవాలలో సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. అదే స్థాయిలో నగరంలోని సంగీత సన్మండలి ఆధ్వర్యంలో ఏటా జనవరిలో ఆరాధనోత్సవాలను వైభవంగా జరుపుతున్నారు.

26 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం..

1995లో తొలిసారిగా సంగీత సన్మండలి త్యాగరాజ స్వామి ఆరాధాన ఉత్సవాలను ప్రారంభించింది. నాటి సంగీత ప్రముఖులు పెమ్మరాజు సూర్యారావు, కేవీ రెడ్డి, మహదేవప్ప లక్ష్మీనారాయణరాజు ప్రారంభించిన సంగీత సన్మండలి నేటికీ క్రమం తప్పకుండా సంగీత ఉత్సవాలను ఏటా నిర్వహిస్తోంది. 9వ తేదీ మంగళవారం సాయంత్రం దుర్గాపురంలోని సంగీత కళాశాలలో సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ ప్రారంభిస్తారు. వారం పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి.

ప్రముఖుల కచేరీలు..

సంగీత ఉత్సవాలలో విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చిన సత్యనారాయణ, హైదరాబాద్ సోదరులు, ద్వారం దుర్గాప్రసాద్, వి. కమలాకరరావు, ఎల్లా వెంకటేశ్వరరావు, అన్నవరపు రామస్వామి, దండమూడి సుమతీ రామ్మోహనరావు, మల్లాది సూరిబాబు, మోదుమూడి సుధాకర్,అంజనా సుధాకర్,అంపోలు మురళీ కృష్ణ మల్లాది సోదరులు తమ కచేరీల ద్వారా సంగీత సన్మండలి ప్రతిష్టను పెంచారు.

ఇవి ప్రధానం..

12వ తేదీ త్యాగ రాజ స్వామి ఉత్సవ సంప్రదాయాన్ని పాటిస్తూ, నగర సంకీర్తన 15వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించే పంచరత్న కృతుల గోష్ఠిగానంలో దాదాపు రెండువందల మంది కళాకారులు త్యాగరాజస్వామి రచించిన సంకీర్తనలను గానం చేస్తారు.

సంగీతమే ఊపిరిగా..



సంగీతమే ఊపిరిగా చేసుకున్న త్యాగరాజ స్వామి ఉత్సవాలను సంగీత ఉత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నాం. సమయపాలనకు ప్రాధాన్యమిస్తూ సంగీత కార్యక్రమలను నిర్వహిస్తాం. త్యాగరాజ స్వామి రచించిన కృతులను మాత్రమే సంప్రదాయ దుస్తులను ధరించి గానం చేయాలి.

– మోదుమూడి సుధాకర్ సన్మండలి కార్యదర్శి



కేసుల విచారణపై సమీక్ష

గుంటూరు లీగల్: జిల్లాలోని న్యాయమూర్తులతో హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్ జిల్లా కోర్టులో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, విచారణలో పురోగతి, వేగంగా కేసుల పరిష్కారం తదితర అంశాలపై న్యాయమూర్తులతో ఆయన సమీక్షించారు. పలు సూచనలు చేశారు. అనంతరం పలువురు న్యాయమూర్తులు ఆయనను సన్మానించారు. సరస్వతీదేవి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, ఒకటో అడిషనల్ జిల్లా జడ్జి గోపాల కృష్ణారావు, నాలుగో అడిషనల్ జిల్లా జడ్జి జి.రామగోపాల్, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

26న శ్రీపంచమి వేడుకలు

సరస్వతీదేవిగా దర్శనమివ్వనున్న దుర్గమ్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శ్రీపంచమిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన సర్వసతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీపంచమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద వేదికను ఏర్పాటు చేసే వేదికపై ఉత్సవ మూర్తిని సరస్వతిదేవిగా అలంకరిస్తారు. సరస్వతిదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే నేపథ్యంలో పాఠశాలలు, స్కూళ్లకు సెలవు కావడంతో విద్యార్థులు సుమారు 40 వేల పైబడి దేవస్థానానికి విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్షలు



గ్రూప్–1 పరీక్షకు వస్తున్న అభ్యర్థులు



అభ్యర్థినికి సూచనలిస్తున్న సిబ్బంది

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

గుంటూరు ఎడ్యుకేషన్/నగరంపాలెం(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షలు ఆదివారం గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 12,242 మంది దరఖాస్తు చేయగా, 24 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 8,104 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 8,063 మంది హాజరయ్యారు. గుంటూరు నగరంలోని ఏసీ లా కళాశాలతోపాటు సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తలేదు. అభ్యర్థుల వ్యక్తిగత సామగ్రిని పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని ఓ చోట భద్రపరిచారు. అలాగే గుంటూరు నగరంలోని ఏసీ, టీజేపీఎస్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను గుంటూరు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద అమలవుతున్న 144 సెక్షన్, బందోబస్తును పరిశీలించారు. ఎస్పీ వెంట కొత్తపేట పీఎస్ సీఐ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, పలువురు ఎస్ఐలు ఉన్నారు.

ఎల్లలు దాటిన కలం స్నేహం

- ఐలవరం హైస్కూల్‌కు వియత్నాం విద్యార్థుల ఉత్తరాలు
- 16 దేశాల విద్యార్థులతో పెన్‌పాల్ కొనసాగింపు
- ఐదేళ్లుగా సాగుతున్న వినూత్న కార్యక్రమం



వియత్నాం విద్యార్థులు పంపిన ఉత్తరాలను చూపుతున్న ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐదేళ్లుగా విద్యార్థుల సృజనాత్మకతకు, భావ ప్రకటనా ప్రతిభకు, ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి పదును పెట్టేలా వినూత్న కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవలంబించని విధంగా వివిధ దేశాల్లోని విద్యార్థులతో ఉత్తర ప్రత్యుత్తరాలను (పెన్‌పాల్) నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 16 దేశాల విద్యార్థులతో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా వియత్నాం దేశంలోని హోచీమింక్ సిటీలోని వెల్‌క్వెల్ హైస్కూల్ విద్యార్థులు పంపిన ఉత్తరాలను ప్రధానోపాధ్యాయులు కాటూరు లక్ష్మీన్నారాయణ ఇటీవల విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా భాషా నైపుణ్యం మెరుగు పడటమే కాక నాయకత్వ లక్షణాలు అలవడతాయని ఆయన వివరించారు. ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ మాట్లాడుతూ వియత్నాం దేశంలోని ఆంగ్లోపాధ్యాయురాలు ధాం ఈ కార్యక్రమానికి సాయపడుతున్నారని తెలిపారు.

నీటి గుంతలో పడి బాలుడు మృతి

బల్లికురవ: గాలి పటం ఎగరేస్తూ నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. ఈఘటన ఆదివారం బల్లికురవ మండలంలోని కొత్తూరు గ్రామంలో జరిగింది. బాపట్ల ప్రాంతానికి చెందిన కర్నెకంటి యువరాజు ఏడేళ్ల క్రితం పాస్టర్‌గా ఇక్కడకు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు హెడ్సన్‌రాజు (6) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. గ్రామం నుంచి కొప్పెరపాడు వెళ్లే రోడ్డులో సొసైటీ భవనం పక్కన ఆదివారం గాలి పటం ఎగరవేస్తూ అతను ప్రమాదవశాత్తూ రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి తీసిన పిల్లర్ నీటి గుంతలో పడిపోయాడు. తోటి విద్యార్థులు దీనిని గుర్తించలేదు. తల్లిదండ్రులు చర్చిలో ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి బిడ్డ కనిపించకపోవటంతో గ్రామంలో వెతికారు. తోటి విద్యార్థులు సొసైటీ భవనం సమీపంలో ఆడుకుంటున్నాడని చెప్పటంతో ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా నీటి గుంతలో పడి చనిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

జనసేనని టీడీపీకి తాకట్టు పెడుతున్న పవన్ కల్యాణ్

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి పదవి ఇవ్వకుండానే తెలుగు దేశం పార్టీకి పవన్ కల్యాణ్ తన పార్టీ జనసేనను తాకట్టు పెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి చర్చలు జరపటంలో ఎటువంటి ఆశ్చర్యం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వారిద్దరూ కలిసే పోటీ చేస్తారని వైఎస్సార్ సీపీ ఎప్పటి నుంచో చెబుతుందని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ 2014 నుంచి చంద్రబాబుతో కలిసే రాజకీయాల్లో నడుస్తున్నారని, ఇప్పుడు కొత్తేమికాదన్నారు. 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీచేస్తే వారి గెలుపునకు పవన్ కల్యాణ్ ప్రచారం చేశాడన్నారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చి అతడికి ప్రయోజనం చేకూర్చేందుకు తాను ఒంటరిగా పోటీ చేశాడన్నారు. ఇప్పుడు మళ్లీ కలిసి 2024లో పోటీచేసేందుకు సిద్ధమయ్యారన్నారు. అయితే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు మద్దతు ఇస్తున్న పవన్ కల్యాణ్‌కు కాపులు ఎందుకు మద్దతు పలకాలని ప్రశ్నించారు. మంత్రివర్గంలో రెడ్లతో పాటు కాపులకు సమానమైన పదవులు ఇచ్చి, సంక్షేమ పథకాలు అమలుచేసి గౌరవించారని తెలిపారు. కాపులకు రిజర్వేషన్ కావాలని ముద్రగడ పద్మనాభం ఆందోళన చేసిన సమయంలో అతడిని చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను కాపులు ఒకసారి గుర్తుచేసుకోవాలని కోరారు. సింగిల్‌గా పోటీచేసి అధికారంలోకి వచ్చే అవకాశమే చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి లేదన్నారు. చంద్రబాబు రాజకీయంలో పవన్‌కల్యాణ్ పావుగా ఉపయోగపడుతున్నాడని ఎద్దేవా చేశారు.

పేదల ముంగిటకు మెరుగైన వైద్యం

మంత్రి మేరుగ నాగార్జున



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: వైద్య సేవలను పేదలకు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఖరీదైన వైద్యాన్ని పేదల ముంగిటకు తీసుకువచ్చిందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. కొల్లూరులోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గతంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సకాలంలో సద్వినియోగం చేసుకోని వారికి తిరిగి నూతనంగా కొత్త చెక్కులు మంజూరు చేయించి వాటిని లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యం ఖరీదుగా మారి పేద వర్గాలకు అందని ద్రాక్షల మారిన తరుణంలో ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం పొందే వెసులుబాటు కల్పించారని చెప్పారు. రూ. వెయ్యి ఖర్చు పైబడిన ఏ జబ్బుకైనా అర్హులైన లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం పొందే అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరికి పథకం ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. పేద వర్గాలకు మెరుగైన విద్య, వైద్యం అందజేయడంతో వారి అభివృద్ధి మెరుగుపడుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా వైద్యశాలలు, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పర్చడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం వెనకబడిన వర్గాల కోసం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన వైద్యం, విద్యను పొందాలని సూచించారు. నియోజకవర్గంలోని 25 మంది లబ్ధిదారులకు రూ. 9.70 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలక ప్రకాశం, ఉప్పు శ్రీనివాసరావు, శింగం కృష్ణప్రసాద్, యడ్ల పెదబాబు, తోడేటి రత్నాకర్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 12 నుంచి ఎడ్ల బండలాగుడు పోటీలు



ఎడ్లపోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: మన సంస్కృతి సంప్రదాయాలలో భాగంగానే ఎడ్ల పోటీలు అని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఫిబ్రవరి 12 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగు పోటీల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అతి పురాతనమైన శైవక్షేత్రం సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలోని అఖిల భారత భక్త కుంటి మల్లారెడ్డి రెడ్ల అన్నదాన సత్రంలో ఎడ్లపోటీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎడ్ల పోటీల కమిటీ సభ్యుడు పులి ఓబుల రెడ్డి, యర్రైద్దు శ్రీనివాసరెడ్డి, నెవలి సీతారామిరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, గాదె వీరారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి విజ్ఞాన కేంద్రం దోహదం

–సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నరసరావుపేట: నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు జిల్లా అభివృద్ధికి దోహదం చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కోటప్పకొండరోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించే పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్టు నిర్మాణానికి దాతలు ముందుకురావాలని పిలుపు ఇచ్చారు. పార్టీలకు అతీతంగా విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, కామినేని రామారావు, ఏవూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, ఎస్.ఆంజనేయనాయక్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ బాబు

సత్తెనపల్లి: క్షేత్ర స్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు కోరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు.తొలిసారిగా జిల్లా అధ్యక్ష హోదాలో వచ్చిన సుధాకర్‌బాబును సత్కారించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి దాసం ఉమామహేశ్వర రాజు, నాయకులు బోడాల సీతాదేవి, నోముల వెంకట చలపతిరావు, మండపు శ్రీనివాసరావు, గడ్డం శివశంకరరావు, వెంకట మల్లికార్జునరావు, ఎ.రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగించడం దారుణం

మాజీ అధ్యక్షుడు అమరసైదారావు

నరసరావుపేట: ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జనవరి ఒకటో తేదీన ఆరుగురు పార్టీ జిల్లా అధ్యక్షులను తొలగించటం దారుణమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కర్ణా అమరసైదారావు అన్నారు. గడియారం స్తంభం సెంటర్‌లోని కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్విట్టర్ ద్వారా తెలుసుకోవడం క్రమశిక్షణ గల కార్యకర్తగా సిగ్గుపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎందుకు తొలగించారో చెప్పాలని వీర్రాజును ప్రశ్నించారు. కేవలం కన్నా లక్ష్మీనారాయణ వర్గమని తొలగించారని భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర కమిటీలో అవినీతిపరులు ఉంటే ఇంతవరకు చర్యలు తీసుకోకుండా వారిని కేంద్ర మంత్రుల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు.

జిల్లా రచయితల సంఘం కార్యవర్గం ఎన్నిక



పాత గుంటూరు: జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఎన్నికయ్యారు. విజయపురి కాలనీలోని సంఘ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం సుభాని, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.బలరాం, కోశాధికారిగా ఎన్‌వీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా ఈపూరు వెంకటరెడ్డి, పి.సుభాషిణి, పి.దుర్గాదేవి, డి.అనిల్‌కుమార్, 11 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

అనుమానాస్పద కారు సీజ్

గుంటూరు ఈస్ట్: రంగు, నంబర్ ప్లేటు మార్చి ప్రయాణిస్తున్న కారును పట్టాభిపురం పోలీసులు సీజ్ చేశారు. వివరాలు.. ఆదివారం పోలీసులు టీజేపీఎస్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈ క్రమంలో నంబర్ ప్లేటు స్థానంలో స్టిక్కరు అతికించి ప్రయాణిస్తున్న కారుపై పోలీసులకు అనుమానం కలగడంతో ఆపి పరిశీలించారు. రంగు, నంబర్ ప్లేటు మార్చినట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

14 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురుపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బాపట్ల టౌన్: గంజాయి విక్రేతల నుంచి 14 కిలోలు స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాపట్ల మండలం, జమ్ములపాలెం సమీపంలోని ఉప్పరపాలెం వద్ద ఇటీవల గంజాయి విక్రయిస్తున్న గండికోట వెంకటేష్‌ను అదుపులోకి అతడి వద్ద 520 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతడి విచారించగా స్టువర్టుపురం గ్రామానికి చెందిన అంగడి చంద్రబాబు అలియాస్ చంద్ర, అతడికి సరఫరా చేస్తున్న చినగంజాం మండలం, రుద్రమాంబాపురం గ్రామానికి చెందిన కొండూరి గోవిందు, కొండూరి సోమయ్య ఇంటిపై దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో గండికోట వెంకటేష్, కొండూరి సోమయ్య, కొండూరి గోవింద్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. స్టువర్టుపురం గ్రామానికి చెందిన చంద్ర పరారీలో ఉన్నారన్నారు. గంజాయి కేసును చాకచక్యంగా ఛేదించిన బాపట్ల రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి, రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్, సిబ్బంది ఎం.వి.రామరాజు, వి.శ్రీనివాసరావు, వేణుబాబు, టి. వెంకటేశ్వరరెడ్డిలను డీఎస్పీ అభినందించారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రాహ్మణ హితులు సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి, శ్రీకాంత్ తదితరులు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణ హితులని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో బ్రాహ్మణ ప్రతినిధుల మహాసభ ఆదివారం నిర్వహించారు. సదస్సుకు గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగానే నాలుగు ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎమ్మెల్సీ సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.300, ధూపదీప నైవేద్యాలకు ప్రత్యేకంగా రూ.240 కోట్లు కేటాయించారన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలయ, అర్చక వ్యవస్థల మేలు కోసం కృషి చేస్తే... దానికి కొనసాగింపుగా వైఎస్ జగన్ వారిని సంరక్షిస్తూ.. ముందుకు సాగుతున్నారు. దేవదాయ ధర్మదాయశాఖ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారులు జె.శ్రీకాంత్ మాట్లాడుతూ బ్రాహ్మణులకు సీఎం జగన్ హయాంలో జరిగినంత మేలు మరెప్పుడూ, మరెక్కడా జరగలేదని పేర్కొన్నారు. ఇటు పార్టీలో అటు ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు బ్రాహ్మణ జాతి అభ్యున్నతికి కట్టుబడి పరిపాలన చేస్తున్నారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బ్రాహ్మణుల కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ కేవలం అలంకారప్రాయంగా మారాయన్నారు. మేయర్ కావటి మనోహరనాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరావుశర్మ, తెనాలి బ్రాహ్మణ సంఘం కార్యదర్శి పోతావఝ్జల పురుషోత్తమశర్మ, మహాసభ నిర్వాహకులు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) మాట్లాడారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము), హిందూ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.ఎస్‌దీక్షితులు, ఆడిటర్లు, గణపతి, కౌతు సుబ్బారావు, రాఘవ స్వామి, సీనియర్ పాత్రికేయులు నిమ్మరాజు చలపతిరావు, సీతారమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ నేత గులాం రసూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరులో బ్రాహ్మణుల కోసం వసతిగృహం ఏర్పాటు చేయాలని, గోశాల నిర్మించాలని కోరారు. త్వరలోనే మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటుకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు.

రాజకీయాల్లో నైతిక విలువలు పడిపోయాయి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్



మస్తానయ్యను సన్మానిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ తదితరులు

గుంటూరు మెడికల్: ఆ నాటి రాజకీయ నేతల్లోని నైతిక విలువలు ప్రస్తుతం కనిపించటం లేదని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ అన్నారు. గుంటూరు ఆర్.అగ్రహారం వెంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి సేవా పురస్కారం ప్రదానం ఆదివారం అందజేశారు. కార్యక్రమానికి కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ గాంధేయవాదం, మన సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తే సమ సమాజం సాధ్యమని తెలిపారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు తన తండ్రి కన్నా రంగయ్య ట్రస్ట్ ఏర్పాటు చేసి కన్నా లక్ష్మీనారాయణ ఆర్థిక చేయూత అందించటం గొప్ప విషయమన్నారు. సమాజానికి బలం చదువు అని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు యువతను అన్ని రంగాల్లో ప్రోత్సాహించాలన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కన్నా రంగయ్య ట్రస్ట్ ద్వారా ఇతోధికంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు, ప్రముఖ ఆడిటర్ మస్తానయ్యను శాలువా కప్పి మెమెంటో అందజేసి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, మాజీ మేయర్ కన్నా నాగరాజు, జేజే సుబ్రహ్మణ్యం, గోరంట్ల పున్నయ్య చౌదరి, తాళ్ల వెంకటేష్ యాదవ్, తురగా నాగభూషణం, పాలిశెట్టి రఘు పాల్గొన్నారు.

పులకించిన హృదయాలు



విశ్రాంత ఉపాధ్యాయుడు ముద్దా లీలామోహన్‌రావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



భట్టిప్రోలు హైస్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

జీవితానికి తొలిమెట్టు.. చదువుల గుడి.. జీవితాన్ని గాఢంగా, లోతుగా తరచి చూసుకునే అవకాశం కల్పించిన చోటు.. ఆనంద జ్యోతులు వెలిగిన కేంద్రం. ఆ వేదిక తాకగానే వారి పాదాలు నాట్యమాడాయి. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు ఏళ్లు వెనక్కి వెళ్లాయి. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. తమ చదువుల గుడికి దాతృత్వపు హారం వేసిన అపూర్వ ఘట్టాలు భట్టిప్రోలు టీఎం రావు పాఠశాలలో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి.

1983-1984 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

భట్టిప్రోలు: స్థానిక టీఎం రావు హైస్కూల్ 1983–1984వ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 155 మందిలో 110 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. 38 సంవత్సరాల తరువాత తాము చదువుకున్న హైస్కూల్‌లో కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో పులకరించిపోయారు. వివిధ కొలువుల్లో దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. తరగతి గదుల్లో చేసిన అల్లర్లను నెమరవేసుకుని పరవశం చెందారు. అప్పటి గురువులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమను తాము మరచిపోయి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం మిత్రులందరికి వీడ్కోలు పలుకుతూ బరువెక్కిన హృదయాలతో బయటకు అడుగులు వేశారు.